

చినవీరభద్రుడు

# ఒంటరి చేల మధ్య ఒక్కత్తే మన అమ్మ

మరికొన్ని కవితలు (1987-1992)

వాడ్రేవు చినవీరభద్రుడు

# ఒంటరి చేల మధ్య

# ఒక్కత్తే మన అమ్మ

మరికొన్ని కవితలు (1987-1992)

ONTARI CELA MADHYA
OKKATTE MANA AMMA,
MARIKONNI KAVITALU (1987-1992)

**-CHINAVEERABHADRUDU**

First Edition:
Magha, Bhava, February, 1995

500 copies

Rs.**10/-**

With a foreword by:
Sri C.V.Krishna Rao, 5A, P.S.Nagar
Masab Tank, Hyderabad

Second Edition:
e-book, Chaitra, Vilambi, 2018
released by **Sri Prachurana**
Dr. P. Vijayasree
89, Navodaya Colony, Mehdipatnam,
Hyderabad - 500 028.

# అభినందన

కావ్యసృష్టి ఎంత విస్తారంగా జరుగుతున్నదో అంత చర్చ జరుగుతున్నది. శిల్పపరంగా, విషయపరంగా, అభివ్యక్తిపరంగా ఈ చర్చ. కావ్యసృష్టి ఇంకా జరగాలని కోరుకుంటున్నాం కాబట్టి ఈ చర్చనూ ఆహ్వానిస్తాం.

శ్రీ చినవీరభద్రుడు అత్యాధునిక కవి. ఆయన రచన వాచ్యం కాదు. ప్రతి కవితనా వాచ్యార్థాని దాటి ఒక పరమార్థం స్ఫురిస్తుంది. దాన్ని సాధించడానికి ఆయన తన సొంత కవితా ప్రక్రియను రూపొందించుకున్నాడు. ఏదో కష్టపడితేనే గాని అందని సంక్లిష్టతతోగాని, అస్పష్టతతోగాని తాను వ్రాయలేదు. మేధావి వర్గాన్ని ఉద్దేశించిగాని, వారు మెచ్చే 'బంధం' లో గాని తన కౌశల్యం చూపదల్చుకోలేదు.

ఇప్పుడు చలామణిలో ఉన్న పడికట్టుపదాల్లో, పదచిత్రాల్లో, కవి సమయాల్లో, శ్రీ వీరభద్రుడు ఇరుక్కోలేదు. తాను 'నిర్వికల్పసంగీతం' ప్రచురించిన్నాడే బయటికొచ్చాడు. ఇప్పుడు ఆయన ప్రతి అక్షరం వెనుక విశిష్ఠత, విజిగీష ఉన్నాయి.

'నిర్వికల్పసంగీతం' లో అక్క అందంగా జుట్టు దువ్వి నెమలీక అలంకరిస్తే ముద్దొచ్చిన well-baby ఇప్పుడు ఇంద్రచాపం పట్టుకొని కనబడతాడు. చాపం కవితారూపం. నారి శిల్పప్రక్రియ. వ్యాఖ్యానానికి అందని అనుభూతి శరం.

లేశమాత్రమే చెప్పి అతని రచనల్లోని కొన్ని రహస్యాల్నీ, ప్రోద్బలాల్నీ చూపే ప్రయత్నం ఇది.

ఈ కవిత్వం విన్నవారు, చదివినవారు ఒక్క క్షణం ఆగి ఆలోచిస్తారు. 'ఇది మంచిది కాదు'–అన్న కవితలో శిల్పప్రజ్ఞ, అన్వీక్షకి, నెత్తుటి స్నానానికై వెళ్ళేవాడి ఒక ఆత్మసంవేదన నిలదియ్యడం చూడవచ్చు.

శ్రీ వీరభద్రుడిగారు కవితల్లో ఇంకో విలక్షణత antinomy. రెండు వ్యతిరేకాల ఐక్యరూపం. 'శాంతిని అభిలషించడమే అన్నిటికన్నా అశాంతి' (నటాషా) అన్నప్పుడు, 'అతనేం చేసినా ఇలాగే ఉంటుంది, అతనేమీ చెయ్యకపోయినా ఇలాగే ఉంటుంది' (గోపీచంద్రునికి) అన్నప్పుడూ, 'దేవతవి, అయినా కాలకూట సర్పాల్తో కొంగుముడి వేశావు' (వర్షించే ఒక మెలకువ) అన్నప్పుడూ, 'ప్రేమించడమంటే ఎంతో పుణ్యం చేసుకున్న ఒకే ఒక పాపం' అన్నప్పుడూ ఈ వ్యతిరేకాల ఐక్యత, ఒక విలక్షణత, స్పష్టం.

ఈ ముప్పై కవితల సంకలనంలో మహానుభావులు, జీవితం, అక్షరం, ఆమె, ప్రకృతి, పోరాటం ఉన్నాయి. దైనందిన సమస్యల్లో తానై రాసినదానికన్నా తాను వ్రాయక వూరుకొనలేని అంతర్మథనం కనపడుతుంది.

కవిత్వానికీ, వ్యక్తిత్వానికీ ఎంత సంబంధముందో శ్రీ వీరభద్రుడుగారితో పరిచయమున్న వారికందరికీ ఒక ఉదాహరణ దొరుకుతుంది. ఇప్పుడు తాను నాలుగువేల అడుగుల ఎత్తున నివాసమున్న గిరిజనులతో జీవిస్తూ తన జీవిత వ్యాసంగం వారి జీవిత వ్యాసంగంతో శృతి కలుపుతున్నాడు. కవితాప్రక్రియలో ఏ ఉత్తమస్థాయిలో మాటకు అద్భుతరూపమిస్తున్నాడో. అదే దీక్షతో, చరిత్ర కందని దశలోనే చూపుకు నైశిత్యం నేర్పిన ఆదిమవాసుల జీవన సోపానానికి మెట్లు కడుతున్నాడు. అశాంతితో శాంతి వెతుక్కునే ఈ స్నేహితుణ్ణి అభినందిస్తున్నాను.

ఇతర వ్యాపకాలటునెట్టి, కవిత్వానికి వేయి చెప్పులప్పగించి, కావ్యాభివృద్ధి పరికిస్తూ తమ కాలాన్ని సౌగంధం చేసుకుంటున్నారెందరో. శ్రీ వీరభద్రుడికి వారు పాఠకులయినందుకు వారినీ అభినందిస్తున్నాను.

హైదరాబాదు **సి.వి.కృష్ణారావు**
ఏప్రిల్,'94

జీవితరహస్యాన్ని వెతుక్కుంటూ

తన ఉషనీ, రాహులుణ్ణీ వదిలిపెట్టి వెళ్ళిపోయిన

**కవులూరి గోపీచంద్ కు**

'The weight of this sadtime we must obey
Speak what you feel, not what we ought to say'

-King Lear, Act.V, 323-324

## ఒంటరి చేల మధ్య ఒక్కత్తే మన అమ్మ

మరికొన్ని కవితలు (1987–1992)


| | |
|---|---|
| కందుకూరి వీరేశలింగం గారికి | 9 |
| సెలవు రాజమండ్రీ, సెలవు | 10 |
| గోపీచంద్రుడికి మూడు పద్యాలు | 12 |
| హైదరాబాద్–రెండు పద్యాలు | 14 |
| అక్షరం పైని ఆశ చావదు | 17 |
| ఇప్పుడు రాస్తున్న కవిత | 18 |
| ఇది మంచిది కాదు | 19 |
| నూర్ జహాఁ | 20 |
| నటాషా!నటాషా!! | 22 |
| దండకారణ్యంలో రెండువారాలు | 23 |
| తొలకరి | 24 |
| ఊద్పులు | 26 |
| వర్షించే ఒక మెలకువ | 28 |
| ఆకుపచ్చని జీవకాంతి | 29 |
| ప్రవాసం ఒక యుద్ధ రహస్యం | 30 |
| మౌనం, ప్రవాసం, మాయోపాయం | 32 |
| ఓల్డ్ స్పైస్ మస్క్ | 33 |
| నట్టనడి మధ్యాహ్నం | 34 |
| అనురాగలత వివశత్వంలో | 35 |
| కానుగచెట్ల గుబుర్లలో | 37 |

| | |
|---|---|
| కవీ,ఆమే | 38 |
| లోలిత | 41 |
| చెరకుతోటల కొసలమీంచి | 42 |
| ముంచుకొస్తున్న వానలు | 44 |
| ఒక్క ఖడ్గం దొరికితే చాలు | 46 |
| కోండలమీంచి భేరీలు | 48 |
| వానపిలుపులు | 49 |
| ఓడ సాగుతోంది | 55 |
| బాహువులు చాపినప్పుడు | 56 |
| ఒంటరిచేల మధ్య ఒక్కత్తే మన అమ్మ | 57 |
| పసిపిల్లలు ఆ కళ్ళు | 58 |
| ప్రియమైన రెండు అశ్లీల పద్యాలు | 59 |
| అసురహస్తం | 60 |
| రెండు పవిత్ర పద్యాలు | 62 |
| ఈ రోజు ఎంత ప్రియమైన రోజు | 64 |
| మరణించి బతికిపోయినవాడు | 67 |
| ఒక్క మహాలింగనంతో | 69 |

## కందుకూరి వీరేశలింగంగారికి

ఏ చేతులు నీ మీద రాళ్ళు రువ్వాయో
ఆ చేతులే నీకు విగ్రహాలు నిర్మిద్దాం, రమ్మంటున్నాయి.
నన్ను క్షమించు, నేను రాలేను,
నాకు చేతుల్నిండా పని వుంది.

1987

## సెలవు రాజమండ్రీ, సెలవు

సెలవు నా ప్రియనగరమా, సెలవు.

సెలవు నా వారణాసికి, నా వియన్నాకి, నా డబ్లిన్‌కి, సెలవు నా
ఏథెన్సుకు,
తన సహస్ర ప్రజానీకపు చేతుల్తో అందించిన జీవఫలపు చేదువిషపానానికి
సెలవు గౌతమికి, గౌతమీ గ్రంథాలయానికి,
సెలవు రాజవీథికి, కందకానికి, కోటగుమ్మానికి, కోటిలింగాలకి.
సెలవు ఉరికంబాల చెరువుకి.
సెలవు విక్రమహాలుకి, పురమందిరానికి,
సాహసోజ్జ్వల చరిత్ర కల్గిన సుబ్రహ్మణ్య మైదానానికి,
స్మగుల్డు సరుకులమ్ముకునే నల్లమందు సందుకి.

సెలవు కళాకేంద్రానికి, కళాసమితికి, కళాదర్బార్ కి, కళాకారులకి,
కళావంతులకి.

సెలవు నీ విశిష్ఠ సమావేశాలకి, వక్తలకి,నీ సంస్కర్తలకి.
సెలవు నీవు కలిపిపెట్టిన అన్నం ముద్దలకి,
సెలవు నీవు రుచి చూపిన ఆకలిరాత్రులకి.
సెలవు నీ ఆగ్రహానికి, అనుగ్రహానికి, నీ ఔదార్యాలకి, దగాలకి.
నీ విశాల బాహువులకి, సంకుచితమనస్కులకి, నీ అర్థరాత్రులకి, నీ
వ్యర్థరాత్రులకి.

సెలవు నీ చిరుజల్లులకి, వెన్నెల తునకలకి,
డిసెంబరు చలిలో సురభిళించే చామంతులకి, క్రిస్మస్ కాంతులకి.
సెలవు నీ ప్రోపగాండాకి, నీ ప్రదర్శనలకి,
నువ్వు పైకి చెప్పుకోలేని నీ సనాతన వ్రణాలకి, పురాతన ఋణాలకి.
సెలవు నీ నీడన గడిచిన నా కాలానికి, నీవు వినిపించిన కవితలకి

నా కోసం తెరిచిన తలుపులకి, ఆదరణకి,
సెలవు నీ మనుష్యులు చేసిన అవమానాలకి, ద్రోహాలకి,
సెలవు నీవు వర్షించిన సంగీతాలకి, రగిలించిన వేదనలకి,
నీ నృత్యాలకి, నీ దగ్గరనే తప్ప మరెక్కడా చెల్లని నీ సత్యాలకి.
సెలవు నీ కానుకలకి, ఆశీస్సులకి,అభిశంసలకి,
సెలవు నీ సంరంభానికి, నీ శూన్యానికి.

సెలవు నా ప్రియనగరమా, ఇక ఎన్నటికీ సెలవు.

1987

## గోపీచంద్రుడికి మూడు పద్యాలు

### 1

ఎన్ని రాత్రులో నా గదిలో ఇద్దరం
ఇష్టంతో, కష్టంతో
ఒక వర్ణచిత్రాన్ని రచిస్తూ వచ్చేం.
అతడావేపునుంచీ నేనీ వేపునుంచీ దారాలు అల్లుకొచ్చేం.
ఇప్పుడా ముఖచిత్రంలో కనిపించింది
అతనికి అతని పోలికలూ, నాకు నా పోలికలూ.
ఇందులో వింతేముంది?
దాన్నట్లా లోకం ముందుపెడితే
ప్రతి ఒక్క మనిషికీ అందులో తన అసలుముఖం తగులుతుంది.

### 2

ఈ వూళ్ళో వున్నన్నాళ్ళూ ప్రతి సంధ్యా
నేనతన్ని తల్లికోశం పిల్లవాడిలా ప్రతీక్షించేను.
అతను రాగానే
నన్ను ఖండఖండాలుగా తరుక్కొని అతనిముందు పోగుపడేవాణ్ణి.
అప్పుడాతను తన కళ్ళనుంచీ, వాక్కునుంచీ స్రవించే
పేరులేని అంజనమేదో
నా ఖండితాంగాలకు పూసి తాను నడిచే దారిపొడుగునా నాటేవాడు.
నా ఆత్మలో మోగే రంపపు చప్పుళ్ళు విని 'ఇక,పుష్పించు' అనేవాడు.
అట్లా మేమిద్దరం
ఈ వూర్ని వుద్యానం చెయ్యాలని చూసేం.

## 3

ఇద్దరం చూడాలనుకున్న రాజఘాట్
తను ఒక్కడే చూసాడు.
అక్కడొక వృద్ధుడు రాట్నం పైని ఒడికిన నూలుపోగు
నాకు కాన్కగా తెచ్చాడు.
అతనేం చేసినా ఇలాగే వుంటుంది.
అతనేమీ చెయ్యకపోయినా ఇలాగే వుంటుంది.

1987

## హైదరాబాద్: రెండు పద్యాలు

### 1

తొలిసంజ కాంతిలో నగరపుష్పం విప్పారినది
మోటారు వాహనాలు జుమ్మని ముసురుకున్నాయి.

పౌడరు పూత దేహాల ఉద్వేగం, టైర్లు, డీసెల్
తాజా వార్తాపత్రికలు, పొగ, సబ్బువాసన
దైనందిన నగరజీవితం పరిమళం నన్నల్లుకుంది.
ఈ శతపత్రవక్రరేఖల వలయాల్లో దినమల్లా తిరిగిన దారుల్లో
తిరుగుతాను.

సెకండ్ హాండ్ పుస్తకాలు, అభిప్రాయాలు
వేళ తప్పని నమాజులు, కిళ్ళీలు, ఉమ్ములు
చర్వితచర్వణాలయిన నీతులు, నల్లని బురఖాలు,
పాలుచిమ్మే యాపిల్ పండ్లు, రహస్యద్వేషాల మొగలాయి
దర్బారులు.

ఎంత తిరిగినా
ఎన్ని సార్లు వచ్చివెళ్ళినా
ఈ నగరం తన రహస్యాన్ని నాకు చెప్పనే చెప్పదు.

మళ్ళీ సంజెవేళకి నగరం ముడుచుకుంటుంది.
అలిసిన గుమాస్తాల్ని
ఇళ్ళకు మోసుకుపోతున్న సిటీబస్సుల వెనగ్గా
నల్గిన రోడ్లమీద విద్యుద్దీపాల వింత నగరం పుట్టుకొస్తుంది.
మానవసంచారపు అమాయికమైన అట్టహాసం కింద
ఏ రహస్య విషాదం దాగివుందో

దూరంగా గోల్కొండ గొణుక్కుంటుంది.
అర్థరహితమయిన ఆబిడ్సు రోడ్డు సంరంభం
అస్పష్టమయిన దిగులుని రేపుతుంది.
కాంక్రీటు రాక్షసాకృతుల నీడలనుంచి
బెదురుగా నంగిరిగా సందులోకి తప్పుకుంటుంటే
ఎవరి జెడలో జాజిచెండో నా బుజానికి రాసుకుంటుంది.

అట్లాంటి ఒక క్షణం మైమరపులోనే
బహుశా ఒక నగరం వైభవమంతా ఉందనుకుంటాను.

## 2

భ్రాంతిలేని జీవితాన్నే కోరుకున్నాం మనం.

జీవించడం ఎలానూ తప్పదు,
ఈ కప్ లో ఒక స్పూన్ నమ్మకాన్ని కూడా కలపమన్నాం.

కాలువగట్టు నీడన సోమరికునుకు తీసిన మధ్యాహ్నాల్లో
'ఏది నిజంగా ఏమిటి?'
అన్న ధ్యాసే లేదు మనకి.

వ్యాపకాల్ని వెతుక్కుంటో రోజులకి రోజులు
ప్రయాణాల్లో కూరుకుపోయినపుడు
ఒకటి రెండు సందేహాలు కలిగినా
ప్లాట్ ఫాంల పైని పోర్టర్ల సందడి కమ్మేసింది మనని.

ఇప్పుడిక ఈ వేగాల ఆరాటాల అల్లిక జిగిబిగిలో
కాళ్ళూ చేతులూ కూరుకుపోయి
ఆక్రందించడమొకటే మిగిలింది మనకి.

అన్నీ ఉన్నాయి ఇక్కడ
అనుభవించడానికి తీరిక తప్ప.

ఇంక జీవితానికి అర్థం వెతక్కు.
అభిలషించినదానికీ, అందినదానికీ మధ్య
ఆ అందమైన తెరనట్లా ఉండనివ్వు.

మనోహరమూర్తి రెబెకాని ముసుగు తొలగించి
చూడాలనే ఆ శిల్పి తపించాడు,
కాని అతనూ మానవుడే కద.

మన విషాదమంతా తొలగించలేని ఆ చివరి తెర.

భ్రాంతిలేని జీవితం ఎంత సుందరమో తెలీదు గానీ
ఈ భ్రాంతిబంధురమైనదే అత్యంత సుందరం మనకి.

1987

## అక్షరం పైని ఆశ చావదు

అక్షరం పైని ఆశ చావదు.
మరణిస్తున్న రోజులనుంచి అక్షరాలు మొలకెత్తుతాయని.

పొగలుకక్కే ఆమ్లద్రవాలు, క్షారజలాలు
వ్యాధిపట్టి నల్లబడ్డ నెత్తురు
చీము స్రవించే కలలు, చర్మం మూలుగులు.
బాధలన్నీ నశిస్తాయని,
ఒక్క ఆశీర్వచనం
ఒక్క శుభ్రసూర్యకిరణంలా నా శయ్యపైని పుష్పిస్తుందని.

మధురతైలాలు, లేత చివుళ్ళు,
మిమిలల చంద్రరశ్మి, గాలికి వూగులాడే నది ముంగురులు,
కనుకొలకుల్లో అశ్రువల్లే కదలని నది ఒడ్డున నావ,
ఆకాశపు ఆ చివర ఆ ఒక్క తార:
జీవితం
ఒక్క అక్షరంగా పునరుజ్జీవిస్తుందని.

అన్నీ అబద్ధాలేననీ, చెరిగిపోయేవేననీ,
ఈ అవమానాలు అవరోధాలు కావనీ,
చివరికి మిగిలేది
అక్షరమేననీ, ఒక్క అక్షరమేననీ.

అడవి అంతటా, ఆకాశమంతటా,
రాత్రులన్నిటా, రోజులంతటా,
అక్షరాలేననీ, అక్షరాలేననీ...

1987

## ఇప్పుడు రాస్తున్న కవిత

నేను ఇప్పుడు రాస్తున్న కవిత
ఒకనాడు నీ కిటికీ పక్కగా ప్రవహిస్తూ వచ్చి ఆగుతుంది.

నువ్వు దాని పక్కగా కుర్చీ జరుపుకుని కూచుంటావు.

నీకేమీ కాని నా వ్యక్తిత్వ ఛాయ
నాచులాగా పరచుకుంటుంది,
ఏదో మిలమిలమని అంచుల్లో మెరుస్తుంది.

నువ్వు దయతోనో అర్థంకాని ఆసక్తితోనో
దుస్తులు విప్పకుండానే ఆ నీళ్ళల్లో దిగుతావు,
మెత్తని నీ పాదాల్ని ఒక వెర్రిచేపపిల్ల చుట్టుకుంటుంది.

'అబ్బ,ఎంత దుర్గంధం' అంటూనే
ముందుకి వంగుతావు,
నీ కాళ్ళని ఒణికిస్తున్న ఆ సజీవస్పర్శని నీ చేతుల్తో అందుకోవాలని.
తడిసిన నీ వేళ్ళ చుట్టూ, మోచేతుల చుట్టూ
మిలమిలలు అల్లుకుంటాయి.
నీకు తెలీకుండానే నువ్వు లోతుల్లోకి జారిపోతావు.

చేపపిల్ల తప్పుకు పోతుంది.
నువ్వు కూడదీసుకుని లేచేటప్పటికి
నీ ఒళ్ళంతా నా అక్షరాల వాసనా, నాచూనూ.

1987

## ఇది మంచిది కాదు

నా చేతిలోకి తన చేతినందిస్తూ ఆమె అన్నది కదా
'ఇప్పుడు నాకేమీ అనిపించడం లేదు, ఇది మంచిది కాదు.'

విధినిషేధాల గుర్తులు కంపించని ఆ అర్ధరాత్రి
మా చేతులమధ్య ప్రసరించేదాన్ని కాదని ఎలా అడ్డగించను?
నా చేతులమధ్య మృదువుగా కదుల్తున్న ఆమె వేళ్ళు.
'నేను నీతో గతంలో ఎంత యుద్ధం చేసాను!
ఇప్పుడలాంటి ఉద్రేకం లేదు, అసలే ఉద్రేకమూ లేదు'.
ఎక్కడో దూరం నుంచి నిర్లిప్తంగా పలుకుతున్న పెదాలు.

మానవదేహం అర్థం కాని ఒక దాహం.

అర్ధరాత్రి నా చేతుల్లోకి తన హస్తాన్ని నిర్జీవంగా వదిలి
'ఇంత తీవ్రత మంచిది కాదు
నేను కాదనను, కానీ మంచిది కాదు'
ఆత్మని అందని ఆకాశంగానూ,
దేహాన్ని జడప్రాయమైన భూమిగానూ వదిలి
సుడిగాలిలాంటి గుసగుసతో ఆమె నా చుట్టూ హోరుపెట్టింది.

నేను ఆమె చేతినందుకున్నప్పుడు ఏ ప్రాణనాడినో పైకిలాగి
ఆమె దేహాన్ని చీల్చి ఉంటానని అప్పుడు గుర్తించాను.
కూలిపోయిన దేహంలోంచి
ఆమె పువ్వులాగో, పక్షిలాగో లేచి అంది కదా
'ప్రతి రోజూ ఇలా చంపుతున్నావు, అలానే కానివ్వు
కానీ ఇది మంచిది కాదు'

1987

## నూర్ జహాఁ

నేను పిలుస్తానో, నువ్వే వస్తావోగాని ఆ క్షణం మనచుట్టూ
వందలు, వేలు అడివిపువ్వులు సురభిళిస్తాయి.
నువ్వు నీ పాటల తేరులోంచి స్మృతుల పరదా తప్పించి
కమానుతో ఉప్పెనలానో తుపానులానో నిలువెల్లా వూపుతావు.

రాత్రి గడిచిపోతూంటుంది.
చల్లని వెన్నెలల పెళ్ళి ఊరేగింపులో
ఆకాశవీథిలో తారకల కారవాఁ నిశ్శబ్దంగా సాగుతుంది.
పల్లకీలో అరమోడ్పుగా చిరునవ్వే నవవధువల్లే జాబిల్లి.

పాదాల్ని కుంగదీసే ఎడారి ఇసికపొరల వలలనుంచి
చూపుల్ని వేటాడే ఎండమావుల ముక్కుతాళ్ళనుంచి
ఈ పిట్టని ఆదరించి ఎగరేస్తావు.
ఏ ఆకుపచ్చని ఒయాసిస్సు నీలి అలలో కదా నీ పాటలు.

నీ స్వరం
ఏ అపరిచిత గృహాల్లోంచో నా ఆత్మీయులైన స్త్రీలు పిలిచినట్టుంటుంది
పాలపైని మీగడలా నీ గానంలో పేరుకునే ఆనందపల్లవం
దిక్కులేని ఆడవాళ్ళకి ఏ జీవనమాధుర్యమో క్రమంగా
అందినట్టుంటుంది.

నువ్వు తలుపులు తీసి
నీ కురుల్ని సవరించుకుని
నీ పెదాల సరసిలోంచి పాటని మృదువుగా పుష్పించగానే
వెయ్యి లఖ్నవీ సారంగులు తీయని బాధతో దిగులుగా అల్లలాడతాయి.
మీర్ కవిచక్రవర్తి ఏ పిరదౌసు పారిజాత వనాల్లోనో స్పృహ
తప్పుతాడు.

ముల్లాలు,మానవగణ పాలకులు
ఒక తృటి మైమరచి ప్రచారాన్నీ, యుద్ధాన్నీ వదిలేస్తారు.

నువ్వు పాటలు పాడుతుంటే
మాఘఫాల్గుణాల మధ్యాహ్నాల్లో
కొండ అంచుల్లోంచి వూగే ఎండుటాకుల వూయెలల్లో
దిగంతాల దాకా వూగిన నా పసితనం నన్నావరిస్తుంది.

అప్పుడు నా దేహం కరిగి, ఒలికి, చిట్లి లోకమంతటా చిందుతుంది.
ప్రతి బాధాదగ్ధ మానవుడి కపోలాలపైనీ నిలుస్తుంది.

నువ్వు శబ్దాన్ని మృదువుగా నీ స్వరపేటికలో మడిచిపెట్టగానే
చెదిరిన అనేకవేల నా ఆత్మశకలాలు ఒకటిగా చేరతాయి.
ఇప్పుడు లోకంలోని అన్ని బాధలూ నేనే, అన్ని ఆనందాలూ నేనే.
నీవు గోరంత దీపానివి, నూర్ జహాఁ!
నువ్వు కొండంత వెలుగువి, నూర్ జహాఁ!

1987

## నటాషా! నటాషా!!

అశ్వారోహణ, నిరసనవాక్యం, తుపాకిమందు, ఆఖరివిందు
ప్రతి అడుగు అవతల కురుక్షేత్రమే.
విధితో ఆడిన ప్రతి పాచిక అంతరార్థం అస్త్రధారణే.
ఇష్టమయినా, అయిష్టమయినా
ప్రతి పోరూ పోరుని తప్పించుకోడానికే.

'ఇది నా ఇల్లు'
'ఈ పువ్వు ఎంత బాగుంది'
'మన మిత్రుడితో ఈ రోజు గడుపుదాం'
ప్రశాంత జీవితం కోసం కోరిన ప్రతి ఆకాంక్షా
ఏ వ్యూహానికో పన్నిన ప్రతి వ్యూహమే.

తన చల్లని మేడపైన కిటికీ చెంత
వెన్నెల వీణాతంత్రులకి గాయపడిన బాలిక,
సంగ్రామరంగంలో మొదటిగాయపు రుచికి మత్తిల్లిన యువకుడు.
అవధుల్లేనిదేదో అపరిమితమయింది
తమని తాకినట్టు కలవరపడ్డవారే.

వాడు యుద్ధం ఫలానా దాని కోసం అంటాడు, నేను నమ్మను.
వాడు యుద్ధం శాంతికోసమే అన్నా కూడా నమ్మను.
తన సమాధిలోంచి ఒత్తిగిలి టాల్‌స్టాయి ఇప్పటికీ
'నటాషా, నటాషా' అంటో మూల్గుతున్నాడు.
ఆ బరువైన పుస్తకం పైన తలాన్చి నిద్రపోతున్న నా చెవిలో
'శాంతిని అభిలషించడమే అన్నిటికన్నా పెద్ద అశాంతి'
అంటో గొణుక్కుంటున్నాడు.

1987

## దండకారణ్యంలో రెండు వారాలు

అంధకాముకుని రాక్షసకాయం పైని
ఎవరో దయగా వర్షించిన అశ్రువులై నక్షత్రాలు.
ఈ అందమైన ఆకుపచ్చనితనం లోతుల్లో
శమించని కాంక్షలు, పూలల్లో క్రూరమైన మధువులు.

ఆయన ఇక్కడ కాంచనమృగం వెంటపడ్డాడు
రాక్షమైన ప్రతిదాన్నీ సంహరించాలని ఆశపడ్డాడు.
నేను రాక్షమైన దాన్నల్లా ద్వేషించాను,
కాని ఆ ద్వేషం ఎంత రాక్షసం.
కాంచనమృగమే నన్ను వేటాడుతోంది.

వృక్షాలు, పరిమళాలు, నక్షత్రాలు, ఆకాశం
కనిపిస్తున్నది ప్రతీదీ నన్ను వేధిస్తోంది, వినిపిస్తున్నది నన్ను వేధిస్తోంది.

నానుంచి విడుదల కావాలనుకుంటే
నన్ను కోల్పోడమే మిగిలింది.

పధ్నాలుగు దినాల ఏళ్ళ మన్వంతరాల ప్రవాసంలోంచి
నన్ను నేను చేరాలనుకుంటున్నాను.
ఏది యుద్ధం? ఏవి ధనుర్బాణాలు? ఏరి ఖరదూషణులు? రావణులు?

దిగువలోయల్లో గొల్లపిల్లవాడు పిల్లంగోవి వూదుతాడు,
తిరిగిరాని మార్గమేదో చూపి పంపుతాడు.
ఈ ప్రవాసం సాగకుండా, జీవనజలధికి సేతువు కట్టకుండా
సంగ్రామం, అగ్నిపరీక్ష లేకుండా
నేను కోల్పోయింది నేను పొందితే ఎంత బాగుణ్ణు.

1987

## తొలకరి

ఇన్నాళ్ళూ అరచేతుల్లో ముఖాన్ని దాచుకొని రోదించాను
ఇన్నాళ్ళూ అపరాధ పంజరంలో చిక్కి కృశించాను
మరణం నాలుగు వైపులనుంచీ మంటపెడుతుంటే
పరాజయఫలం పెదాల్ని పురుగులాగ కరుస్తుంటే
ప్రతీముఖం పొగలుచిమ్మే ద్వేషపాత్రతో ఎదురవుతుంటే
నరకలోకాలన్నిటా అనాథప్రేతంలా సంచరించాను
చావులన్నిటిలోకీ దుర్భరమైన చావు పొందాను.

ఇప్పుడు అద్భుతాల్లోకెలా అద్భుతాన్ని చూసాను.
చిరవిరహరజ్జువుకి బిగిసిన స్వరం
తొలి ఆషాడ మేఘసందర్శనంతో గొంతు విప్పుకుంది.
మోడువారిపోయిన వృక్షశాఖలపైని
స్వర్గసీమల పావురాలు వాలి వసంతాన్ని పలికించాయి.
శాపాల బరువికి కుంగిపోయిన భూమి శిరసుపైన
శతకోటి గంగలు వర్షించాయి.

ఇప్పుడు పాటలన్నిటికన్నా గొప్ప పాట విన్నాను
అన్ని దిక్కులనుంచి వెయ్యి వీణలు, వేణువులు మోగాయి
అన్ని అడవుల్లోనూ నెమళ్ళు పింఛాల వింజామరలు వీచాయి.
నదులు, సెలయేళ్ళు, సముద్రాలు పులకరించాయి.
తోటలన్నిటిలోంచీ పువ్వులన్నీ పలకరించాయి.
ఆకాశలోకమంతటా వారుణదేశ కన్యలు ఒప్పులకుప్పలాడారు
పురిటిగదుల్లోంచి చిన్నారి శిశువులు మృదువుగా నవ్వారు.
పద్నాలుగు లోకాలనుంచీ శాంతిదేవతలు మంగళగీతాలు
ఆలపించారు.

ఊర్ధ్వ అధోలోకాలు ఒక్కటయ్యాయి
అందమైన కన్యల పారాణిపాదాలపైని మువ్వలల్లే
ఎండలో వానచినుకులు మెరిసాయి.

ఉపమాలంకారం ఇప్పుడు సఫలమైంది.

ఇప్పుడు దృశ్యం గాయత్రి, శబ్దం గాయత్రి
త్రిలోకాలూ గాయత్రి,
                        ఇప్పుడు
జన్మలన్నిటిలోకీ సార్థకమైన జన్మ పొందాను.

1987

## ఊడ్పులు

దూరదిగంత వీధుల్లోంచి, కొండల ఎగుడు గిగుళ్ళమీంచి
తొలిస్తన్యధారల్ని క్రుపిస్తూ మేఘధేనువులు కదలివస్తున్నాయి.
పైకాళ్ళతో, చేతుల్తో, కళ్ళతో లేగదూడలు ఎగిసిపడుతున్నాయి.

అగ్నివాయువులు వీచిన మహాగ్రీష్మాలు ఆ ఎండలేవి?
నింగి ఆ కొసనుండి ఈ కొసదాకా నీలిమేల్ముసుగుతో
నిలిచి చూస్తున్న ఈ కన్య ఎవరు?
వంగి బారులు తీరి తదేకదీక్షతో ఈ స్త్రీలు
తమ చేతుల్తో రచిస్తున్నదేమిటి?

ముద్దలుగా కరుగుతున్న మట్టిలో మంత్రాక్షరపంక్తులు.

కురిపించు నీ కండల స్వేదాన్ని,
అమృతజలధారల్లో వివశత్వంతో కరిగిపోతున్న విరాట్ శరీరాన్ని.
చాళ్ళు తీసినవి నాగలి కొర్రులు,
గునపాలు, పారలు, మట్టి తట్టలు వందలు వేలు చేతులు
వేళ్ళ సందుల్లోంచి చల్లిన బంగారు విత్తనాలు.

ఈ భూమి ఎవరిది? ఈ గింజల్ని విత్తి గింజల్ని పండిస్తున్నది ఎవరికోసం?
ఇప్పుడు దస్తావేజులు లేవు, భూమి హక్కులు లేవు, రెవెన్యూ కోర్టులు లేవు
ఉన్నవి సన్నగా వణికించే చిరుజల్లులు, హాయిగా తూగాడే గడ్డిపోచలు
ఈ లేతకంకుల్లో పాలు పొంగినప్పుడు కదా
ట్రాక్టర్లు, మార్కెటు యార్డులు, గిడ్డంగులు గుర్తుకొచ్చేది

ఇప్పుడే ప్రశ్నలూ లేవు, భయాలు లేవు, బాధలు లేవు
ఈ రోజంతా ఆనందమధురమైన శ్రమ, రాత్రికి విశ్రాంతి.

శ్రమిస్తున్న స్త్రీల పాదాల చుట్టూ వెన్నలాంటి మట్టి,
మెత్తగా బురదలో దిగబడుతున్న ఆ అడుగుల్లో అడుగుల్ని కలుపు.
నేల నిన్ను నీటివలతో బంధిస్తుంది.

ఐక్యం కోసం, ప్రేమకోసం, ఆదరణ కోసం ఎవరి చేతులూ ఖాళీగా ఉండవు.
అందరితో పాటు ఆశల్ని నాటు.
కష్టిస్తున్న చేతులకు తోడుగా నీ చెయ్యీ వెయ్యి.
ప్రేమ జలజలమని కురుస్తుంది, ఆదరణ గలగల ప్రవహిస్తుంది.
మట్టి మధురాతిమధుర ఫలంగా మనుషుల్ని ఒక్కటి చేస్తుంది.

1988

## వర్షించే ఒక మెలకువ

కొలనుగట్టున మెట్లపయిని దీపతోరణాలు గుచ్చిన పందిట్లో
అడవిపూల తీగల్లాగ చేతులు చాపి
గుసగుసలాడే మువ్వల సవ్వడి మధ్య
తేజోవంతమైన చీకటిని నాకు కాన్కగా అనుగ్రహించావు.

వెన్నెల చంద్రశిలాకుడ్యాన్ని సముద్రం రంపాల్తో కోసి ఘోషిస్తున్నప్పుడు
సన్నని నీ నడుం చుట్టూ కొంగులాక్కుని
దీపహర్మ్యాల్లాంటి దూరనౌకల్ని చూపిస్తూ
విషాదభరితమైన మధురానందాల్ని నా నెత్తిన కుమ్మరించావు.

పత్రశయ్యల మధ్య పుష్పాల పరిమళాల అనురాగ ప్రజ్వలనంలో
నాలుగడుగుల నీడయినా దొరకని మహాజనారణ్యంలో
ఏదో ఒక రైలు స్టేషన్ ప్లాటుఫాం మీద దుమ్ములో బిచ్చగాళ్ళ మధ్య
జీవఫలపు చేదువిషాన్ని కొసరి కొసరి తినిపించావు.

గోడల మధ్య గదుల్లో జీవితాన్ని పణం పెట్టే లెక్కల్ని గుర్తుకు తెస్తో
విధినిషేధాభ్యంతరాల వెయ్యికళ్ళ పదివేల ప్రశ్నార్థకాల్ని పక్కకు తోసి
నిశ్చల దరహాసంతో, మోహపరిమళాలు వీచే దేహచందన తరువువి,
దేవతవి, అయినా మహాకాలకూటసర్పాల్తో నాకు కొంగుముడి వేసావు.

నా చీకటిపడే సమయాలన్నీ నీవి
నా కలలన్నిటా నీవు
నా దేహాంతఃపురంలో ఎక్కడో చితిపేర్చుకుని
మహామోహసముద్రంలో బడబాగ్నిలాగా ఆర్చుకుపోతున్నప్పుడు, వర్షించే
ఒక మెలకువలాగా ఉదయించేదీ నువ్వే.

1989

## ఆకుపచ్చని జీవకాంతి

ఆకుపచ్చని జీవకాంతి ఆకాశానికి అడ్డంగా వేయి చేతులు చాచి
నా కోసం ఒక గూడు నిర్మించింది.
నిప్పులు చిమ్ముతో సాగుతున్న సూర్యరథం ధూళి, లోకం పైన
అకళంకమైన ఆనందపు నీడ ఇక్కడ, ఈ కిందన.

పండిన ఫలాల వెచ్చని హెచ్చరికల సౌరభంతో
బరువయిన తీపిగాలులు మృదువుగా స్పృశించి అలరిస్తున్నాయి.
కానీ కిందన పోగుపడ్డ యీ ఎండుటాకులు నన్ను కలవరపెడుతూనే వున్నాయి.
ఏమో బహుశా వీటికింద ఆ స్త్రీ దేహం దాగివుందేమో.

తాకి చూద్దునా, టపటపలాడుతూ స్కాండల్స్.
ఆ చప్పుడు మధ్యనుంచే నిశ్శబ్దంగా పక్కకి ఒత్తిగిలిన
నిండు వక్షోజాల ఏప్రిల్ అందాలు,
నిద్రపోతూనే ఈ కన్య ఒక చేత్తో నన్ను బలంగా దగ్గరకు లాక్కుంది.

ఒక ఈదురుగాలి రానీ,
ధూళిలేపుతో అనుమానపు కళ్ళని పొడుస్తో ఈ ఆకులు పక్షులై ఎగరనీ,
చేతులు చాపి రక్షించుకుంటోన్న జీవితాగ్రం నుంచి,
తొడిమ వదిలి మహానంద సాఫల్యంతో ఆ ఫలం నేలరాలనీ,
సాహసవంతమైన ఆ పిరుదుల ఒత్తిడిలో నా కళ్ళు మూసుకుపోనీ,
వాన పడనీ.

1990

## ప్రవాసం ఒక యుద్ధ రహస్యం

పార్వతీపురంలో ఎండకాయదు, పండుతుంది
చలిపెట్టదు, కరుస్తుంది.

పురాస్వప్న మృదుభీకరపరిష్వంగం నుంచి విడివడి
అడవిపాములాగా
సరసర ప్రవహిస్తుంది నాగావళి
విప్పారిన దాని పడగపైని
దీపమణికిరీటాన్ని అలంకరిస్తుంది 'తోటపల్లి'
మహాదివ్య హరితఛత్రం కప్పిన
సాంద్ర దండకారణ్యం
ఒక తీవ్రగాఢాన్వేషణలో
నా భూమిగా ఒదిగిపోతుంది.

ఇంకా ఇక్కడి కొండల్లో చెరగని నెత్తుటి మరకలు
ఎక్కుపెట్టి విడిచిన విల్లమ్ములు, అయినా
సముద్రమంత అన్యాయం మధ్య సవరవాడొక్కడు.

అమరవీరులకు స్మారక జయకేతనం ఎత్తిన 'మొండెంఖల్లు'
సంతల్లో పోంచి చూసే కొత్తదళారీ నేడు.

భయవిహ్వలమైన ఈ నేలతంత్రుల్ని మీటు!
దళిత ఆందోళితమైన దీని లయని పరికించు!

ఇక్కడ నువ్వు మనసారా ఏది సంకల్పిస్తావో
దశదిశలా రేపు ఆ సంగీతాన్నే వింటావు.
ప్రజల్ని సేవించడానికి
నిన్ను నువ్వు అర్పించుకుంటానంటే చాలదు,

ఆ సమర్పణావేశానికి
ఒక మహాశరీరాన్ని తీవ్రసంయమనోద్రేకాల్తో
సమాయత్తపర్చుకోవడం తెలుసుకోవాలి.

ప్రేమించుకోడమంటే రక్షించుకోవటమని
కోతకెదిగిన పంటని కాపుకాచుకునే
ఏ రైతునడిగినా చెప్తాడు.
విల్లుగా వంచడానికైనా
వేణువుగా మలచడానికైనా
ఏ వెదురు మంచిదో ఎంచుకోవడం
ఏ అడివినడిగినా నేర్పుతుంది నీకు.

ఈ రోజు నువ్వు పారిపోయావని వాళ్ళంటారు
కాని రేపు నువ్వు తియ్యబోయే ఎదురుదెబ్బలో
వేట రహస్యం ఎంత వుందో
ఎవరు గ్రహించలేరు గనక!
అంతదాకా నిన్ను నమ్ముకున్నవాళ్ళ మూగ కన్నీటిచెంపల్ని
అడివిగాలులో, నక్షత్రాల చేతులో
ఆదరంగా తుడవనివ్వు.

1990

## మౌనం, ప్రవాసం, మాయోపాయం

ఉద్ధృతమైన దివారాత్రాల్ని యీదుకొంటో
అలజడి తుపానుల్ని
అరచేతులు అడ్డంపెట్టి కాచుకోంటో
నా పురాతన తీరాన్ని
తడుములాడుకుంటున్నాను.

కిక్కిరిసిన చీకట్లలోంచి
చుట్టూ నిఘాపన్నిన వ్యూహాల్ని తప్పించుకొంటో
కాంతిమంతమయిన ఒక పురుగునై
నా ప్రియనగరాల్లోకి
ప్రవాసిగా రహస్యప్రవేశం చేస్తున్నాను.

ఇక్కడ నీ వీథులు, నీ భవనాలు
నీ రోడ్లమీంచి రేగే ధూళి
మంటల్ని మండించే ఎండ
నీ కుశలప్రశ్నలు, కరస్పర్శ.

కానీ, మౌనం ఒక మాయోపాయంగా నేను.

అయినా ఈ క్షణాన
ఆకాశవృక్షపు చిటారుకొమ్మ వంచి
చిన్నదే అయినా
నక్షత్రదీపంలాంటి ఒక అద్భుతపుష్పాన్ని
నీకు ఇవ్వకుండా ఉండగలనా?

1990

## ఓల్డ్ స్పైస్ మస్క్

ఈ ప్రాచీన మహాసుగంధం కోసం
ఏ పర్వతసానువుల్లోనో
ఇంకా ఆ హరిణం వెతుకులాడుతునే వుంటుంది.

నీవు నా ఎదట వున్నన్నాళ్ళూ
ఈ సుగంధమే జ్ఞప్తికి లేదసలు.
నిండుతనువు ఒక నవచందన తరువుగా
నీ జడపాయల్లోంచి పరిమళించిన పరిమళాలు
అన్నిదేశాల సుగంధాల గాఢతనీ మరపించినాయి.

దూరదేశంలో ఒంటరివేళ
నా ఒంటినిండా చిమ్మిన ఈ సుగంధంలో
చిట్లిన విలాపాశ్రువులు
నీ కన్నుల నల్లని రెక్కలు టపటపలాడి
నా గదినిండా కమ్ముకున్న తుపాను.

దేవదారు తరుపంక్తుల మధ్య
సాయం సంధ్యావేళలో
నెమ్మదిగా సాగుతున్న కస్తూరిమృగాల గుంపు
వాటిని వెన్నంటే ఒక మహాప్రాచీన సుగంధ ధూళి.

తన గుంపునుంచి తప్పించుకొని
ఒంటరిగా ఆరాటంతో
ఈ ప్రాచీన మహాసుగంధం కోసం
ఏ పర్వతసానువుల్లోనో
ఇంకా ఆ హరిణం వెతుకులాడుతునే వుంటుంది.

1990

## నట్టనడి మధ్యాహ్నం

నట్టనడి మధ్యాహ్నం
వెదురుపొద నీడకు లాక్కుని
నా ఒళ్ళంతా
ముద్దులతో కాల్చాడు వీడు.

కొలిమి ధూమాలెగజిమ్మే
ఎండ హోరులో
నునులేత తృణాంకురాల్ని అల్లరిబిల్లరి చేసి
వెన్నెల వీవనలనుకొమ్మన్నాడు.

పట్టుదుప్పటిలాంటి నా నడుము మీద
చురుకుమంటూ ఎండ మండుతుంటే
వేళ్ళ కొసలతో గిలిగింతలు కొసరింతలుగా చిలకరించి
పడి పడి నవ్వించాడు.

కడకు వీడి అల్లరికి
ఎండపైన బహుద్వేషం మండుకొచ్చింది నాకు.

1990

## అనురాగలత వివశత్వంలో

అనురాగలత వివశత్వంలో ఒంగిన ఏ ఒంపునో
చేతుల్తో పొదివి పట్టుకుని
మోహపుష్ప పరిమళాల్లో మూర్ఛిల్లిపోయాం మనం.

ఉగ్రంగా కెరటాలు ఘోషించడం విన్నాం.
ప్రచండమయిన గాడ్పులు వీచడం చూసాం.
నిలువెల్లా కదిపేసే
ప్రతి గాఢసందేశంలో
అన్నిటినీ మరచి ఒక్కటయిపోయాం.

అక్కడే, జీవితం ప్రేమగా కరిగిపోయిన
ఆ రహస్యస్థలంలోంచే
పక్షులు సూర్యుడుదయించే దిక్కుగా ఎగరడం చూసాం.
ఈ నేలలోంచి
రాగద్వేషాల అంతర్విద్యుజ్వాలల్లోంచి
ఉద్రేకగరళాల్నీ, శాంతిపీయూషాల్నీ పీల్చుకున్న ఈ వేళ్ళు
బలంగా, సజీవంగా
పూచిన తమ ఒక్క పుష్పాన్నీ ఫలప్రదం చేసుకోవడం చూసాం.

ఇక నలిగి విరిగిన దేహనౌకలు
ఈ సుడిలో పడిమునగనీ
ఈ వడిలో తడబడి తునాతునకలనీ
ఏమయినా కానీ.

చీకట్లు వెలిగిన ప్రతిసారీ
ఉజ్వలధావళ్యంతో ఉదయించే
పవిత్రమయిన ప్రతి సాఫల్యంలోనూ మనమే ఉంటాం.

1991

## కానుగచెట్ల గుబుర్లలో

కానుగచెట్ల గుబుర్లలో తడుస్తోన్న వాన.
తేమగా పరచుకున్న నీడల్లో
రాలుతున్న పూలు రహస్యమాడుతున్న
గుసగుసలు.
ఏ మృదువయిన జ్ఞాపకం బాధపెడుతోంది నిన్నిపుడు?

ఎంత రాత్రయినా
నువ్వు నీ ఇంటికి తిరిగి వస్తావని
ఈ చెట్లు నీ కోసం ఎదురుచూస్తాయి.
వాటిని కావిలించుకోవాలనిపించదా?
అయినా నీ మొద్దునిద్ర నీది.

లోపలయినా
బయటయినా
నీకు నువ్వే బందీవి.
ప్రతి మోహపూరిత సందేశానికీ బానిసవి.

నీ పెదాలు ఆ పెదాలని అందుకున్న ఆ ఒక్క క్షణం మటుకు
నువ్వు జీవితంలోకి స్పృహ తప్పుతావు.
ఇక జీవించినంతకాలం జ్ఞప్తిచేస్తుంటాయి
చెమ్మగిలిన నీ చలితాధరాలు
ఒణుకుతూ
ఇదే మరణం ఇదే జీవితం ఇదే జీవితం ఇదే మరణమని.

1990

## కవీ,ఆమె

కవి ఆమె ఇంటికి వెళ్తాడు.

అల్లుకున్న పూలపందిరి నీడలో
ఆమె అతనికి వెచ్చని టీతో స్వాగతమిస్తుంది.
ఆకాశానికి నక్షత్రాలు తోరణాలు గుచ్చుతాయి
ఆకులజొంపాల్లో కొత్త చివుళ్ళు కిలకిల్లాడుతాయి.
రాత్రుల వెనక రాత్రులు
రోజుల వెనక రోజులు గడుస్తాయి.

కవి ఆమె దేహపు ప్రతి ఒంపునీ, కదలికనీ
నిశ్చలంగా ఆరాధిస్తాడు
ఆమె అడుగులు అరవిందాలయి పూసిన చోట ప్రతిసారీ
ఒక శప్తమధుపంలా వాలి నిశ్చేష్టితుడవుతాడు.

ఆమె కవి కోసం ప్రతి రోజు ఎదురుచూస్తుంది.

దైనందిన జీవిత సంరంభాన్నంతా ఒక పక్కకు తోసి
రెండు కుర్చీలు, ఒక టీపాయి పట్టేటంత కార్నర్‌ని
మిగుల్చుకుంటుంది.
ఎన్నటికీ పూర్తికాని రెండు పుస్తకాలతో
ఎప్పటికీ జవాబు రాని ఒకే ఒక్క తెలియరాని ప్రశ్నతో
అలసటతో, నవోల్లాసంతో
విరిసినా వాడని పూలవాజ్ లోని ఒకే ఒక్క పువ్వులా ఆమె.

అభిప్రాయాలు సంఘర్షిస్తాయి.
బాహ్యప్రపంచం తరంగితమయి విరుగుతూంటుంది
ఆమె కవి కళ్ళలో, అతని శబ్దంలో, నిశ్శబ్దంలో

చంచలంగా వూగుతుంది.
అతని మాటలు శంఖాలయి మోగిన ప్రతిసారీ
తనలో తాను తుళ్ళిపడి తబ్బిబ్బవుతుంది.

కవికి ఆమె రూపం పట్ల మోహం
మాటల బోలుతనం తెలిసినవాడు కనుక
నశించే ప్రపంచంలో
ఏదీ కూడబెట్టలేవు, ఆత్మజ్ఞానాన్నయినా.
వెదజల్లే రంగుల్లో
పత్రహరిత ఛాయల్లో, సుస్వరపరిమళాల్లో
ఏకాంతంగా మనోరథంలో
పుష్పాల శయ్యలో మైమరిచే క్షణాల్ని కలగంటాడు కవి.

ఆమెకి కవి అక్షరాల పట్ల దాహం
అవయవాల చచ్చుతనం అనుభవైకవేద్యం కనుక
కాలి కమురుకంపు కొట్టే దేహాలు, వెంట్రుకలు
అన్నీ నశిస్తాయి, ఒక్క అక్షరం తప్ప.
కూడదీసుకున్న అంతరంగంలో
రాగద్వేషాల పొగలు చిమ్మని రహస్య సజీవత్వాన్ని
మామిడాకులో ప్రసాదంలా పెట్టి
జీవనవ్రతం ముగించి ఫలశ్రుతిగా
కవి తనకందిస్తాడని ఆశపడుతుంది ఆమె.

శరీరాన్ని తడుములాడుకుని
అగమ్యారణ్యంలో వదిలిపెట్టి పారిపోతాడు కవి
అతను మోసగాడు,
అతనికి మిగిలేది చింపిన చీరెముక్క.

అనశ్వరమయిందేదో వెదుకులాడుకుని
రహస్యమేదో అందనివ్వని ఒట్టి అనుభవపు ఎడారిలో తప్పుకుంటుంది
ఆమె మరీ మోసగత్తె,
ఆమెకి మిగిలేది అర్థం కాని కాగితం ముక్క.

1990

## లోలిత

తామరతూడులు ఆ బాహువులు నా బాహువుల్లో
ఆ ఆంతరంగిక విసాదాగ్ని నా ప్రచండదేహమండలమంతటా
ఆ చంచల నేత్రాలు
ఆ పవిత్ర మోహవీక్షణాలు...

ప్రేమించడమంటే బలంగా కావిలించుకుని చంపుకోవడం.

అశ్లీలమైన ఆ దివ్య ఊరువుల మధ్య వర్షించే నిష్కళంక దయావృష్టిలో
అల్లిబిల్లిగా అల్లుకున్న ప్రాచీన కేశ తమస్సు.
నీ వేళ్ళ రహస్య మధురోష్ణతలో
గిలగిలలాడే ఆ సీతాకోక చిలుక వణుకులో
స్పర్శ ఒక ఆరని జ్వాల.

ప్రేమించడమంటే వేళ్ళ కొసల్తో స్వర్గాన్ని తాకి చూడటం.

పాలుగారే చెక్కిళ్ళు, పసినేత్రాలు
నీవు ప్రేమించిన ప్రతి పడతీ నీ తల్లి, నీ తనయ.
కనుకనే ఆ లేత రొమ్ముల ఎదట
నీవొక చిన్నారిబిడ్డగా
నీ బుల్లిపెదవులతో మారాం చేస్తావు.
వివిక్తప్రసన్నంగా ఆ నా బంగారుతల్లి నిన్ను దయతలచగా
ఆమెను నిలువెల్లా హత్య చేసి నువ్వు పునరుజ్జీవిస్తావు...

ప్రేమించడమంటే ఎంతో పుణ్యం చేసుకున్న ఒకే ఒక్క పాపం.

(వ్లదిమీర్ నబకోవ్ 'లోలిత' ను స్మరిస్తూ)

1991

## చెరకు తోటల కొసలమీంచి

చెరకు తోటల కొసలమీంచి జల్లు జల్లున గాలుల అల్లరివాన
ఒక చిన్న సూర్యదీపాన్ని వెలిగించుకొని
ఆకాశగుమ్మానికి పసుపురాసి తోరణాలు కడుతున్నారు.
వేదమంత్రాల గడ్డిపోచల్ని ఉంగరాలుగా వేళ్ళకి తొడుగుతున్నారు.
నిండుగా కాసి పరిపక్వభారంతో వంగిన అరటిబోదెల
గట్టుకట్టిన చేలల్లోంచి గలగలమని ప్రవహించే పంటనీళ్ళు
మంగళకలశాల్లాంటి గోవుల పొదుగుల్లో మైమరిచిన లేగలనోళ్ళు
ఈ మట్టిబాట నిండా
మంచుముత్యాలు, పారాణి, బంతిపూలు, పాటలు చల్లి
ఆనందరంగవల్లులు తీరుస్తున్నారు ఆడపిల్లలు.

గంతలు కప్పిన నీ గుర్రపు బండి
దుమ్మురేగే వీథుల్లోకి తీసుకొచ్చింది నిన్ను, ఎంతో అలవాటుగా.
ఎక్కుపెట్టిన నీ ప్రశ్నార్థకాల ధనుస్సు
మారింది పూలబాణాల దసరావిల్లుగా.

ఆసక్తి ఒక్కటే ఇంతవరకూ నీకు తెలిసిన భాష
ఆత్రంగా ప్రతిదాన్నీ తడిమిచూసి ఖండించే నీ దీనరాక్షస జిజ్ఞాస.
ఏళ్ళ తరబడి చేసుకుంటూ వచ్చిన దీర్ఘనిరాకరణల్లోంచి
ఈ నాటికి నువ్వు అడుగుపెట్టిన స్వర్గంలో
మళ్ళీ అదే మట్టి, అవే చెట్లు
కానీ ఎంత వెలుగు.

ఒక జీవితకాలంలో అనేక జన్మల్ని త్యాగం చేసి
నువ్వు కొత్తగా కట్టుకున్న ఈ స్వర్గంలో
నీ తాతతండ్రుల పాత ఇంటి పోలికలు

ఎంత మహానిర్మాణమో, అయినా నీ స్వర్గం
నువ్వు పుట్టిపెరిగిన మట్టి యిల్లే.
చిరపరిచితమైన ఆ కొత్తదనంతోనే
ఇప్పుడీ ఇంట్లోనూ అడుగుపెట్టు.

1990

## ముంచుకొస్తున్న వానలు

అడవులపైన గ్రామాల పైన కురుస్తున్న వానలు
ధారాపాతంగా వానలు
ఎడతెరిపిలేని వానలు.

చెట్లమధ్య నీ ఇంట్లో
దీపం వెలుతుర్లో
నువ్వు వింటున్న వీణ ఎవరిది?
వయొలిన్ ఎవరిది?
వేణువు ఎవరిది?

గర్జిస్తున్న ఫిరంగులు, బాంబులు
చుట్టబెడుతున్న తిరుగుబాటు దళాలు, బావుటాలు
కత్తుల మధ్య వర్షిస్తున్న నెత్తురు.
ఆ కొండల మధ్య
ఆ ఏటవాలు లోయ అంచుల్లో
ముణగదీసుకున్న ముసుగుదుప్పటిలోంచి
తలెత్తిచూసే ప్రభాతపుష్పాలు.

పరాజయం ఒక గాటు.
దాన్నుంచి విషం ఒక రహస్యక్రిమిలా
నీ రక్తంలో ప్రవేశిస్తుంది.
చీకట్లు, భయాలు,ఇంద్రియ సుఖాలు ఆ వెనక.

చలిగాలుల్లో తడిసి వణికి
నీ ఇంటి తలుపు తట్టే పనిపిల్ల.
దాని కళ్ళు చూడు.

అడవులపై నుండి ముంచుకొస్తున్న వానలు
గ్రామాల్ని చుట్టబెడుతున్న వానలు
ఎడతెరిపిలేని వానలు
ధారాపాతంగా వానలు.

1991

## ఒక్క ఖడ్గం దొరికితే చాలు

ఒక్క ఖడ్గం దొరికితే చాలు
సమస్యలన్నీ శమిస్తాయి
సంకోచాలన్నీ నశిస్తాయి
ఒక్క ఖడ్గం ధరిస్తే చాలు.

మొహమాటాల చిరునవ్వులు
మర్యాదలు,
బురఖాలు ఎన్ని కప్పుకున్నా, నీ
అసలయిన ముఖం
హఠాత్తుగా బయటపడటమే
ఒక ఖడ్గం.

నీ పక్కవాడు, స్నేహితుడు, పైవాడు
ఎవరయినా కానీ
మనిషి ముఖం వదిలి
అసురముఖం చూపగానే
నువ్వు నోరు కూడదీసుకుని శపించడమే
ఒక ఖడ్గం.

నీ చేతిని నిర్దాక్షిణ్యంగా ఖండించు
పూలదండలు మాని పిడికిళ్ళు బిగించాలని.
నీ కళ్ళని పెరికి పారెయ్యి
మోహపు చూపులు మాని దయతో దహించాలని.
నీ హృదయాన్ని చీల్చి వేసెయ్యి
జాలిచేష్టలు మాని ఉక్కుసమ్మెట కావాలని.

నీ అంతరంగం ఛిద్రమవడం
బాహ్యరంగం భగ్నమవడం
ఒక్క కన్నీటి చుక్క చిట్లి కొత్త ఆకృతినివ్వడం
ఒక్క జీవరక్తకణం ప్రభవించడం
అదే ఒక ఖడ్గం.

ఒక్క ఖడ్గం అందితే చాలు
సమస్యలన్నీ శమిస్తాయి.
సంకోచాలన్నీ నశిస్తాయి.
ఒక్క ఖడ్గం పొందితే చాలు.

1991

## కొండలమీంచి భేరీలు

కొండలమీంచి భేరీలు మోగుతున్నాయి
పిలుపులు తొందరపెడుతున్నాయి
జనం యాత్ర సాగిస్తున్నారు.

అయినా వెదురు తడికల తలుపు దగ్గర
మట్టిగోడకి జారగిలి
ఇంకా ఏదో చెప్పాలని
దిగులుతో కన్నీళ్ళతో ఆమె.

రథాలు అసహనంగా వేచి వున్నాయి
గడియారాలు అలార్మిస్తున్నాయి
అదేపనిగా హారన్లు మోగుతున్నాయి.

అయినా డ్రాయింగు రూం లో
పట్టుదిళ్ళ సోఫామీద కోమలహస్తాలు చాపి
ఇంకా ఏదో వినాలని
మత్తుగా మోహంతో ఆమె.

ఉరితాళ్ళు పేనుకుంటున్నాయి
చితి సమిధలు రాజుకుంటున్నాయి
చీకట్లు చిక్కనవుతున్నాయి.

నిర్జనపథాంతంలో
అగాధంలోకి జారుతున్న ఆ ఒక్క మలుపులో
ఏ దిక్కుకో దారి చూపుతో
ఓదార్పుగా ధైర్యంగా ఆమె.

1991

## వానపిలుపులు

1

తాళలేకపోతున్నాను ఆ పిలుపు విని
కాని ఏ దిశనుంచని?
ఏ దారుల్లో నడవాలని?
మట్టి అరుగులపైన వెలిగే దీపకాంతుల్లోనా?
మహానగరమధ్యంలో ఆడిటోరియాల్లోనా?

2

ఒక్క పిలుపు
కాని ఆ పాటలు, నృత్యాలు
వేనవేల ఆ కంఠాలు
ఆ స్మృతులు,
ఆ గ్రామాలు.

తెరచాపలెత్తిన మబ్బులు
తాటితోపుల్లోంచి వానమేనాలో ఆ నవ్వులు.
వెళ్ళిపోదాం
పొలాల్లోంచి, ఈ బాటలమీంచి
స్త్రీలతో, ఈ పిల్లలతో
తడిసిన గాలిపటాలతో
పదండి, మనం వెళ్ళిపోదాం.

3

వాన అద్భుతంగా పిలుస్తున్నది ఈ రాత్రి
కురవనీ వర్షాలు
ప్రచీన గ్రామాల్లోంచి.

4

ఇంటిచుట్టూ చెట్లమీద వాలాయి
వానపిట్టలు.
నీ దీపం, నీ విశ్రాంతి
మర్చిపోయిన నీ గ్రామాలు నిన్ను పిలుస్తున్నాయి
ఎన్ని పిలుపులని నీ నిద్రకి మేలుకొలుపులు.
ఆ అమ్మవారి జాతరలు
ఆ పిల్లంగోవులు, రంగులు, బూరాలు
ఆ ఒంటరి మలుపుల్లోంచి
ఎదురుపడే పచ్చికబయళ్ళు.

5

నువ్వు వదిలి వచ్చిన గ్రామాలనుంచి
ఈ వాన మందలు నిన్ను వెతుక్కుంటూ వచ్చాయి.
మెరుపుల మధ్య
నీ ప్రియ జీవితపు జాడల్ని చూడు
తరలి పోదాం పద.
ఆ తోటవారన, ఆ బావి పక్కన
ఆ మలుపులో
వదులుకున్న నీ బాల్యానికి.

## 6

నిన్ను మరవలేని గ్రామాలు పిలుస్తున్న పిలుపు
నీ ఇంటినుంచి నువ్వు ఎటు బయట పడగలిగితే
అదే నీకు విముక్తి దిశ.
ఏ పిలుపుకి నువ్వు లేవగలిగితే అదే నీకు మేలుకొలుపు.
జాగు చెయ్యకు
తెల్లవారకముందే
రాత్రి గాలుల్లోంచి తేలిపోదాం.

## 7

వదిలిపెట్టు నీ శయ్యని.
నీ బంధాల్ని, బాంధవ్యాన్ని.
నేలలో కలలు కంటున్న తొలివిత్తనాలు నిన్ను పిలుస్తున్నాయి
అడవి మధ్య ప్రవహించే రహస్య జలాలు నిన్ను కలవరిస్తున్నాయి.

ఈ దేహం ఏ ప్రాచీన మృత్తికలో అంకురించిందో
ఆ ముడుతలు పడ్డ స్మృతులు నిన్ను లాలిస్తున్నాయి.
ఆ కురులు
ఆ పొలిండ్లు నిన్ను ఆదరిస్తున్నాయి.
ఆ ఆవులు
ఆ శాలల్లో తడిసిన ఎండుగడ్డి, పొదుగుల్లో క్షీరాలు
ఆ దొంగాటలు, వెన్నెలతోటలు.

పదపోదాం
జాగు చెయ్యక.

## 8

ఎవరూ నీ చెంతలేని వేళ
ఏమిటమ్మా ఈ వాన అల్లరి!
ఎవరు పిలుస్తున్నారంటుంది?

## 9

అన్ని ఆరాటాలూ నశించాలి.
వర్షించనీ
వర్షించనీ
వర్షించనీ
వర్షించనీ
నిలువెల్లా నన్ను దహించేలా.

## 10

మృదువుగా వీస్తున్న ఈ గాలులు ఏ గ్రామాలనుంచి?
ఏ తల్లుల ఒడిలో మైమరచిన పిల్లల శ్వాసలు?
అడవిలో పరుగెత్తే అర్థరాత్రి రైలు
ఆ రహస్యనదీలోయలో వంతెన నీడలో
ఏ సందేశాన్ని అందుకొంది?

రావిచెట్ల మధ్య అమ్మవారి కోవెలలో
ఏ తూర్పుదేశ ప్రత్యూషం కాచుకోంది?

మిత్రుడా!
నీ దుఃఖం
ఆకాశంలో వరదలెత్తిన ఈ వాన.

మిత్రుడా!
నీ దుఃఖం
నీకూ నాకూ ఒక మైదానంలోనే విడిది.

మిత్రుడా!
నీ దుఃఖం
నన్నుక్కిరిబిక్కిరి చేస్తున్న వర్షం నీ కన్నీరు.

## 11

ఈ వినిపిస్తున్న స్వరాన్ని పోల్చుకోలేకున్నాను.
ఏ గ్రామాల్లోంచి, ఏ పొలాల్లోంచి
పండిన వరికంకుల బంగారు ఆకాంక్షల్లోంచి పాడుతున్న
ఏ పాటలివి?

ఏ రాత్రుల్లోంచి, ఏ నీడల్లోంచి
ఏ సరసుల మృదుశయ్యల మీంచి ఏ కలల్లోంచి పాడుతున్న
ఏ పాటలివి?

ఏ తడిసిన దారుల్లో, ప్రవహించే వరదల్లో
ఏకమై వూళ్ళూ బయళ్ళూ పిలుస్తున్న పిలుపులివి?

## 12

ఈ స్వరాన్ని నేను పోల్చుకోలేకపోతున్నాను.
ఏ పల్లెల్లోంచి, ఏ ఇళ్ళలోంచి
ఏ పురాతన గృహాల్లోంచి ఈ పిలుపు?
ఏ వాగ్దానాలు, ఏ ఆశలు?
ఏ బంగారు భవిష్యత్తు.

అడవులమీంచి నగరం దాకా అల్లుకున్న ముసురుమబ్బు
ఊగిసలాడిపోయే లేత వరిపోచలపైన
మిలమిల్లాడే నీటిముత్యాలు.
నిద్రలో, తీరికలో, నాలో ఏ తంత్రి మీటితే, చిట్లితే
ఈ స్వరం వేయి స్వరాలవుతోందో.

ఏ అందని రేగుపండుకోసం
ఈ కంపరేగుచెట్టుని వూపుతున్నాదమ్మా ఆ బాలిక!

ఏమీ ఇవ్వలేనని
ఒక మూలగా ముడుచుకు కూచోనా?
ఏమీ ఇవ్వలేనంటోనే
ఒక్క ఉదుటున మీ మధ్యకు ఉరికిరానా!

1991

## ఓడ సాగుతోంది

బద్దలవుతున్న కెరటాలమీంచి జారుతూ
ఓడ బయలుదేరింది
కనుచూపులో మేరలేని సముద్రపు చివరి అంచులకేమో.

భయదాంధకార మార్గాల్లోంచి
అగాధమైన అలలమీంచి
ఓడ సాగుతోంది.

భీషణావరోధాల్ని అతిక్రమించి
భయవిచలిత దిగ్బంధనాల్లోంచి
దూరాల్లోకి దూరాల్లోకి
ఓడ సాగుతోంది.

ప్రళయంకరమైన మహాపర్జన్య శంఖాలు మోగినా
తుపానులే వీచినా
దారి చెదిరినా దిక్సూచి ఆగినా
ఆగదు ఓడ.

ఏ సుడిగుండమో మింగినా
ఏ రాక్షర మహాజలచరమో తాకినా
చింతించదు ఓడ.

సముద్రం మీంచి పయనించినా
సముద్రంలోకి పయనించినా
ఆగి వెనుచూడని ఓడ.

1991

## బాహువులు చాపినప్పుడు

బాహువులు చాపినప్పుడే
అభ్యంతరాలన్నీ చెదిరిపోయ్యాయి.

నక్షత్రాలు గూడుకట్టి
చెట్టు నీడ పరిచినప్పుడే
కలలు కలకల్లాడాయి.

అయినా ఒక మహాసర్పం
వెన్నాడుతున్న భ్రాంతి.
దిగంతాలదాకా తెరచి వున్న
మహానేత్రం మందలిస్తున్న భ్రాంతి.

ఒడి తెరిచి బొమ్మను బయటకు తీసి
ఇల్లు కట్టి ఆట ఆడావు.
పీటని పల్లకీ చేసి
బొమ్మలకే పెళ్ళి చేసి వూరేగించావు.

బాహువులు చాపితేనే చాలదు
బంధించడానికి
ఇక్కడ హృదయం కూడా వుండాలి.

1991

## ఒంటరి చేల మధ్య ఒక్కత్తే మన అమ్మ

నాగళ్ళు చాళ్ళు తీసినప్పుడు
గింజలు చల్లినప్పుడు
నాట్లు నాటినప్పుడు
కంకుల్లో పాలు పొదిగినప్పుడు
ఆశగా అవలంబనగా మన అమ్మ.

పైర్లు నిండుగా వంగినప్పుడు
పాటలప్పుడు, పంటకోతలప్పుడు
పంట చేటల్తో తూర్పుకెత్తినప్పుడు
తృప్తిగా అన్నం ముద్ద కలిపినప్పుడు
దయగా, ధైర్యంగా మన అమ్మ.

కలలు కన్నప్పుడు
కన్నీళ్ళు పొంగినప్పుడు
పొద్దుపొడిచినప్పుడు,
పొద్దు కుంగినప్పుడు
ఒక్కరీతినే కన్నతల్లి మన అమ్మ.

ఒంటరిచేల మధ్య
ఒక్కత్తే మన అమ్మ.

(కర్నూలు పట్టణం సరిహద్దులో వెలిసిన చల్లనితల్లి ఎల్లమ్మను స్మరిస్తూ)

1991

## పసిపిల్లలు ఆ కళ్ళు

ఆమె ఉన్నత వక్షం మీంచి అలవోకగా జారిన
జడపాయల్ని తాకుతూండగా
పురాతనమయిన పిలుపు ఏదో తాకింది వేళ్ళని.

ఆ కళ్ళకేసి చూసాను.
అమాయికమైన పసిపాపలు
ఇంటిగడపచెంతనే
తల్లికోసం కాచుకున్నట్టు వున్నాయవి.

అశ్వాన్నెక్కి యుద్ధం వైపుగా
మైదానాల్లోకి సాగిపోయిన ఏ వీరుడి కోసం
వెతుక్కుంటూ పోయిందామె?

ఓన్ని తెరలూ దింపెయ్యి.
ఆ చీకట్లో
ఒకే ఒక్క దీపాన్ని వెలిగించి
వెతుకులాడు.

పసిపిల్లలు ఆ కళ్ళు
దిగులుగా ఎదురుచూస్తూనే వున్నాయి.

1991

## ప్రియమైన రెండు అశ్లీల పద్యాలు

1

ఆ ఒక్క క్షణంలో
కాళ్ళతో కాళ్ళను చుట్టుకుంది.

రాత్రి సంగతి తెలిసిన
నక్షత్రాలు నవ్వుకున్నాయి.

ఒకటిరెండు జాజిపువ్వులు
పందిరి మీంచి జారిపడ్డాయి.
(పందిరిమంచం మీంచి)

ఇది శృంగార కవిత కాదు
సృష్టి కవిత.

2

మంచం పైన పరచుకొన్న భూమిలాంటి దుప్పటి మీద అమర్చిన
ఆ రెండు వక్షోజాల్నీ ఆబగా అందుకుని
'వీటిని నాకిచ్చెయ్యి' అన్నాను.

చాలాకాలం కిందట అతనికి చెప్పినట్లే
'తీసుకో, అవినీవే' అంది, నాతో.

ఒక్క నిషిద్ధఫలంలో
దేవుణ్ణి పోగొట్టుకున్నాను అప్పుడు.
ఈ రెండు ఫలాల్తో
నిన్నూ దేవుణ్ణీ అందుకొంటానిప్పుడు.

1991

## అసురహస్తం

కిటికీ రెక్క తెరిచి పరదా సర్ది
కుర్చీలు అమర్చి
కూచుంటారు మీ ఇద్దరూ
అందమైన పూలబంతుల్లాంటి
ఒకళ్ళ హృదయాన్ని మరొకళ్ళు స్పృశిస్తూ.

అప్పుడు టీపాయ్ చీల్చుకుని
అసురహస్తం మొలుచుకొస్తుంది.
అది నీకు సిగరెట్ ఆఫర్ చేస్తుంది.
ఆమెకి ఆ పొగ పడదు.
చిరుచెమట పట్టిన ఆమె నుదుటిని నువ్వు తాకగానే
నీ చేతుల్నుంచి ఏదో కుట్టి ఆమెకి స్పృహ తప్పుతుంది.

ఉదారంగు నీడ ఒకటి అప్పటికే
మీ మీద పరచుకుంటుంది
ఆ గోడనుంచి ఈ గోడ దాకా.

చెట్లకిందకో బీచి ఒడ్డుకో
లైబ్రరీకో పాఠశాలకో పోదాం అనుకుంటారు.
కానీ మీ కన్నా ముందే
అన్ని మూలల్లోనూ అసురహస్తాలు మొలిచివుంటాయి.

దీనికి మరో ముగింపు లేదు
ఖడ్గం తీసుకో
నీ రెండు చేతుల్నీ నరుక్కో.
అసురహస్తాలు వాటికవే అంతర్ధానమవుతాయి.

అప్పుడామె తనంతతానే
తన చేతుల్ని నీకు అందిస్తుంది.

1991

## రెండు పవిత్ర పద్యాలు

### 1

కలశంలో నిండుగా నీళ్ళు పోసి పెట్టినట్టు
తొణకని సాయం సంధ్య,
ఆతిథ్యంలో అసలైన మర్యాద ఇప్పుడే.

పొలాల్లో వంగిన వరిపైర్ల మీంచి గాలులు
దూరాకాశతీరాల్లో చిట్లిన నక్షత్రకాంతులు.

ఆమె ముఖాన్ని ఇటు తిప్పకు
రాత్రంతా గడవనీ.

భూమి ఆమె వక్షం,
ఆకాశం ఆమె వదనం.

### 2

గోడలకి తలుపుల్నీ
తలుపులకి పరదాల్నీ
అడ్డుపెట్టి కట్టుకున్న
అతిచిన్న రహస్య స్వర్గంలో
ఆమెనుంచి అందుకున్నవి
ఆ రెండే పెదవులు.

కళ్ళకు తెలీదు
చేతులకి తెలీదు
అధరాలదే ఆ అస్తిత్వమంతా.

పొరపాటున ఎవరన్నా ప్రశ్నించారో
అస్తిత్వాన్నంతా దిగమింగుకుని
మూగబోతాయి అప్పుడు
అధరాలు కూడా.

1991

## ఈ రోజు ఎంత ప్రియమైన రోజు

ఈ రోజు ఎంత ప్రియమైన రోజు
ఈ రోజు నువ్వు నా దేశానికి వచ్చావు.
పళ్ళతో, పువ్వుల్తో, నవ్వుల్తో, నాట్యాల్తో నీకు మావాళ్ళు
స్వాగతం పలుకుతారు
చిట్లిన వీపుతో, వంగిన నడుంతో, బరువెక్కిన వదనంతో
దూరం నుంచే మేమంతా
మా పొలాల్లోంచి, వీథుల్లోంచి,
నీ రాక గురించి కుతూహలంగా, గర్వంగా, ధైర్యంగా తలుచుకుంటాం.

ఈ రోజు నువ్వు భారతదేశానికి వచ్చావని
దక్షిణాఫ్రికా సంతోషపడుతుంది.
ఈ రోజు నువ్వు భారతదేశానికి వచ్చావని
ప్రపంచం కళ్ళప్పగించుకుని చూస్తుంది
ఈ రోజు నువ్వు భారతదేశానికి వచ్చావని
అమెరికా వగైరా అణురాజ్యక్షిపణులన్నీ అసహనంగా
కుములుతుంటాయి.

1915 లో బొంబాయి ఓడరేవులో
మోహన్ దాస్ గాంధీ దిగినప్పుడు
ఆయన చేతుల్లో స్వాతంత్ర్య సందేశాన్ని పంపింది దక్షిణాఫ్రికా
ఇన్నేళ్ళు పట్టింది
మళ్ళీ స్వేచ్ఛాసందేశం వినడానికి ఈ దేశానికి.

ఈ రోజు నిజంగా ప్రియమైన రోజు
కంపిస్తున్న అడుగుల్తో నువ్వు నా నేలమీద అడుగుపెట్టావు
దురాధికృతని సహించని వినమ్రశిరస్సుతో.

ఇరవైఏడేళ్ళపాటు జైల్లో వున్నావన్న ఒకేఒక్క ఆశ్చర్యం తప్ప
మా ప్రభుత్వాధినేతలకు నువ్వు మరేమీ కావు
జైళ్ళు నిర్మించడమే తప్ప జైళ్ళు తెలియని వాళ్ళకి
ఈ రెండు రోజులూ నువ్వొక గర్వకారణమైన బందీవి.

మరకలేకుండా తళతళ మెరిసే డ్రాయింగ్ రూం బల్లలపైన
మోచేతులు ఆనించి
నీతో సంభాషించే అదృష్టం నోచుకున్న ఆ గాడిదలకు నువ్వు
ఏమీ అర్థం కావు.
నువ్వు ఆ గదుల్లోంచి బయటకు రాగానే
ప్రకాశమంతమైన నీ నేత్రాల మహాశయపు ధగధగలూ కదిలిపోతాయి.

నువ్వు చూసిన దేశం నా దేశం కాదు,
నీకు నా అసలైన దేశాన్ని చూపించాలని ఉంది.
ఉక్కలో, చెమటతో, కిక్కిరిసిన బస్సుటాపుపైన కణకణలాడే ఎండలో
రైతులమధ్య కూలీలమధ్య దళారీలమధ్య చోటు కోసం
కిక్కిరిసిన ధూళిలో
నిన్ను నా ఊరికి తీసుకువెళ్ళాలని ఉంది.
పండినవీ, పండనవీ, అయినా నా కెంతో ప్రియమైనవీ, అన్నంపెట్టేవీ
నా ఊరిపొలాలకు అడ్డంపడి నిన్ను తీసుకు వెళ్ళాలని ఉంది.
లేగకూనలు, తూనీగలు, తెల్లమబ్బులు తారట్లాడుతుంటే
బావిగట్టు పైన చిందే నవ్వుల చిలకరింపుల్లో మెరిసే పాదాల వెంబడి
సన్నని కాలిబాటమీంచే నా ఇంటితోవ పట్టాలని ఉంది.
వానకు తడుస్తున్న ఇంటిచూరు కింద
కట్టెలపొయ్యిలో పొగ వూదుతో మా అమ్మ
నువ్వొస్తే తన సొంత అన్న వచ్చినట్టుగా సంతోషిస్తుంది.

బక్కచిక్కినవి నీ దేశంలోలాగే నా దేశంలోనివీ ఆవులు, గేదెలు, మేకలు
వాటిని చూస్తూ నువ్వు ఎంత ఆదరంగా పరవశిస్తావో చూడాలని ఉంది.

తాటాకు ఇళ్ళ గుడిసెలు, నిట్రాతి గూళ్ళు, కోపురుగడ్డి వాసలు
పేడ అలికిన అరుగులు, ఎర్రమట్టి మిద్దెలు
ఆ ఇళ్ళని చూడగానే 'నా ఆఫ్రికా' అంటూ అరుస్తావేమోనని
ఆశగా ఉలిక్కిపడతాను.

దేవుడులాంటిఒక మనిషిని మీ మధ్యకి తెచ్చానర్రా
అని మా వాళ్ళకి చెప్పబోతే
'ఇతను మాలాంటి మనిషే, రైతు, కూలీ, కమ్యూనిష్టు' అంటారు
మా వాళ్ళు.

1991

## మరణించి బతికిపోయినవాడు

హంతకుడు తానెవరో చెప్పకుండా హత్య చేసాడు.
అతని డిమాండ్లు అతనికే స్పష్టం కానట్టుంది, రాత్రి ఏ వేళనో నా ఇంటిగోడమీద
కొంత నెత్తురు జిడ్డుగా రాసిపోయాడు.
ఆ మృతదేహశకలాల్ని అందరినెత్తినా పడవేసిపోయాడు.

దుర్మరణం చెందిన మనిషిలో నేను
ఎవరికన్నా అధికమయిందేదీ చూడలేకపోయాను, అతని దురదృష్టాన్ని తప్ప.

కొన్నేళ్ళ కితం అతని వదనం ఎంత సుందరంగా ఉండేది
రాజోద్యానంలో విరిసిన కమలంలా ఉండేది
ఏళ్ళమీదట అతను తనవి కాని దారులంట సంచరిస్తుండగా
మృత్యుపక్షి రెక్కలనీడ అతనిని వెన్నాడుతుండేది
అనుక్షణం బ్లాక్ కాట్ కమెండోలు దాన్ని తరుముతూనే వుండేవారు.

అతను జీవించినప్పుడు కూడా నాకతనిపై ఏ ఆశలుండేవి కావు,
ఆ మృదులనేత్రాలు
తన పార్టీని, ముఠాల్ని, పీడక సంస్కృతిని దాటి చూడగలిగితే బాగుండనిపించేది.

అతని పిల్లలు, భార్య, ఆదివారం తీరికవేళన
సంజగాలుల్లో, బాటమలుపుల్లో డ్రైవింగ్, కొంచెం కాఫీ, ఆపైన సంగీతం
కవిమిత్రులతో ఉల్లాసకరమైన డిన్నర్-
అతని అన్ని దినాలూ ఇలా గడిపి ఉంటే వందేళ్ళు అద్భుతంగా
బతికి వుండేవాడు.
ఒక తూలికలా, పువ్వులా, సరస్తీర పక్షిలా
చేతులడ్డుపెట్టికాచిన దీపంలా, పొదుగులోని క్షీరంలా బతికివుండేవాడు.

కాని అతను మరణించాడు.

తనని ఒక శిథిలవ్యవస్థకి అపురూపమయిన ఆభరణంగా
ఒక నినాదంగా, ఒక పతాకంగా, నిరవధికమైన, నిర్లజ్జాకరమైన దోపిడీకి,
హింసకి
ఒక సాకుగా
తనని వాడుకున్న తన సహచరులు, మృగప్రాయులందరి వాతపడి
ఇన్నాళ్ళుగా అతను మరణిస్తూనే ఉన్నాడు.

ఇప్పటికి అతను మరణించాడు, ఎన్నటికీ తిరిగిరాని విధంగా-
మరణించి నిజంగా అతను బతికిపొయ్యాడు.

1991

## ఒక్కమహాలింగనంతో

ఒక్కరోజులో ఎవరూ
ప్రజలకు చేరువకాలేరు.

ఒక్క గాఢాతిగాఢమయిన
నిర్ణయంతోనో
కఠోరమయిన ప్రతిజ్ఞతోనో
దహించివేసే ద్వేషంతోనో
పగతోనో, పరాక్రమంతోనో
నువ్వు ప్రజలకోసం
ఉద్యమించగలవు–కానీ
చేరువకాలేవు.

తీవ్రాతితీవ్రమయిన
ఖండనలతోనో, దూషణలతోనో
శరసంధానంతోనో
శత్రుగర్భ మృత్యు రహస్యఛేదనంతోనో
నువ్వు ప్రజలకోసం
కడదాకా సంగ్రామించగలవు
కానీ–చేరువకాలేవు.

ఒకే ఒక్కటనుకునే ఏ ఒక్క మార్గంలోనూ
ఎవరూ ప్రజలకు చేరువకాలేరు.

నిలువెల్లా గాయాలతో
నెత్తిన కంటక కిరీటంతో
హృదయం నిండా పొదివిన
పరిమళ భరిత పుష్పాలతో

పరిహాసాల్తో, కన్నీళ్ళతో
మందహాసాల్తో
ఉదయాస్తమయ ఉద్వేగాల్తో
రాత్రుల దిగుల్తో
ఒంటరితనంలో, సమ్మర్దంలో
కుడిఎడమలతో
నేత్రాలతో, వీనుల్తో
పాదాల్తో, హస్తాల్తో
పుస్తకాల్తో, పాశాల్తో
అంకుశాలతో, ఇక్షుదండాల్తో
అనేకరోజుల తరబడి
అనేక జన్మల ఒడిదుడుకుల మీంచి
అన్ని దిశలుగా
అనేక మార్గాల్లోంచి
సాధ్యమయ్యే ఒకే ఒక్క
మహాలింగనంతో తప్ప
ఒక్క రోజులో ఎవరూ
ప్రజలకు చేరువ కాలేరు.

1992

రాయాలంటే ఏదో ఒక ఉద్వేగం తాళజాలనంతగా కమ్ముకుని రావడమే కాదు, రాయాలంటే గొప్ప ప్రేమకూడా కలగాలి లోకం పట్ల. ఎంతో బాధ్యతతో చేయాలి ఆ పని. నా తరంలో పైకివస్తున్న ఎంతోమంది యువకుల్లో ఆవేశం ఎక్కువా, ప్రేమ తక్కువా. నేనూ వాళ్ళలాంటివాణ్ణే కాని అక్కడితో ఆగిపోకూడదన్న కోరికే నన్ను విస్తృతంగా రాయడం నుంచి అదుపు చేస్తోంది. ఉద్వేగం ప్రేమగా వికసించేదాకా ఓపిక పట్టడమే నేను చెయ్యగలిగింది.

26-7-91